క్లుప్తంగా

చలివేంద్రం కేంద్రం ప్రారంభం



ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో స్థానిక సర్పంచ్ జోగుల రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం పదో బెటాలియన్ అదనపు కమాండెంట్ అనిల్‌కుమార్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రవల్లి కూడలిలో నిత్యం వేల మంది రాకపోకలు కొనసాగించే ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రాముడు, వెంకటన్న, మద్దిలేటి, పరమేశ్వరయ్య, శ్రీను, దాసన్న, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి నిరసన



మల్దకల్: సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మండల కేంద్రంలో వీఓఏలు రోడ్లను ఊడ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీఓఏల సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు మాట్లాడుతూ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఉద్యోగ భద్రత పాటు రూ.10 లక్షల ప్రమాదబీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు తిమ్మప్ప, గోవిందు, లోకనాత్, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఏస్తేర్, తిరుమలేష్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ఇంటర్వ్యూలు



గట్టు: మండల కేంద్రంలోని మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. గట్టు ఎస్‌బీఐ బ్యాంక్ పరిధిలో 48 మంది దరఖాస్తు చేసుకోగా 28 మంది హాజరైయ్యారు. మాచర్ల బ్యాంక్ పరిధిలో 33 మంది దరఖాస్తు చేసుకోగా 12 మంది హాజరైనట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆగమవుతుంటే ఆత్మీయ సమ్మేళనాలా..?

శాంతినగర్: అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోయి రైతులు ఆగమవుతుంటే బీఆర్‌ఎస్ నాయకులు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో సంబరాలు చేసుకోవడం సరికాదని ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలంపూర్‌లో ప్రతిపక్షం లేదని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అలంపూర్ చరిత్ర, రాజకీయాల గురించి కనీసం అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత



గట్టు: మండలంలోని ఇందువాసి సెక్టార్ 1, 2, 3, 4, 5 సెంటర్‌లలో బుధవారం ప్రీ స్కూల్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వాసంతి పిల్లల అభివృద్ధి పుస్తకంపై చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రీస్కూల్ మేళా సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగ్యమ్మ, ఈరమ్మ, కావేరి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో బూస్టర్ డోస్

అయిజ: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బూస్టర్ డోస్ అందుబాటులో ఉందని మెడికల్ ఆఫీసర్ విష్ణు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు బూస్టర్ డోస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాక్సిన్ తీసుకునేవారు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలు తప్పనిసరి అని పేర్కొన్నారు.

దళిత మోర్చా గ్రామ కమిటీ ఎన్నిక

ధరూరు: దళిత మోర్చా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిమ్మప్ప, ఉపాధ్యక్షుడు ప్రశాంత్, జయన్న, ప్రధాన కార్యదర్శి రవి, సోషల్ మీడియా రాజులు ఎన్నికయ్యారు. ఆనంద్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు.

నిఘా నీడలో పల్లెలు

- గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

మానవపాడు: ఆధునిక సమాజంలో సీసీ కెమెరాల ప్రాధాన్యం ఎంతో అవసరం పడుతోంది. శాంతిభద్రతల పరిరక్షణలో నిఘా నేత్రాలు దోహద చేస్తున్నాయి. దీంతో ప్రభుత్వం పట్టణాలు, పల్లెలు, సున్నితమైన ప్రదేశాలలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటోంది. ఏదైన సంఘటనలో నిందితులను గుర్తించేందుకు సీసీ కెమెరాలలో నిక్షిప్తమైన సమాచారం ఎంతో కీలకంగా ఉపయోగపడుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకుంటూ కేసుల ఛేదనలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. గతంలో పట్టణాలకే పరిమితమైన సీసీ కెమెరాలు నేడు మారుమూల పల్లెలకు సైతం విస్తరించాయి. ఒకప్పుడు సీసీ కెమెరాలు అంటే గ్రామంలో వింతగా చూసే పరిస్థితి. గ్రామాలో ప్రతి ఒక్కరికి స్మార్ట్‌ఫోన్, తక్కువ ధరకే నాణ్యమైన ఇంటర్‌నెట్ వంటి అందుబాటులోకి వచ్చిన తరుణంలో సీసీ కెమారాలు వాడకం కూడా గ్రామాలకు విస్తరించింది. మండల కేంద్రంలో ప్రధాన కూడళ్ల వద్ద నిఘా నేత్రాలు ఏర్పాటు చేసారు.



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన దృశ్యాలను చూస్తున్న ఎస్‌ఐ

14 కెమెరాలు ఏర్పాటు

మండలంలో ఇప్పటి వరకు 14 కెమెరాలు ఏర్పాటు చేశారు. మండలంలో 16 గ్రామ పంచాయతీలకు గాను ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో కూడళ్ల వద్ద బిగించారు.



మానవపాడు ఎన్‌హెచ్-44 లో సీసీ కెమెరా

ఎప్పటికప్పుడు పర్యవేక్షణ

ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో నిక్షిప్తమవుతున్న వీడియోలను పోలీసులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. 24 గంటలు వీడియో రికార్డు చేసి, పోలీస్ స్టేషన్‌లోని డీవీఆర్‌లో నిక్షిప్తం అయ్యేవిధంగా చర్యలు చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లో కెమెరాల ద్వారా జరుగుతున్న విషయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

నేరాల నియంత్రణ సులభం



గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడం ఎంతో సులభతరం అవుతుంది. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు నివారించవచ్చు.

– సంతోష్, ఎస్‌ఐ, మానవపాడు

సీసీ కెమెరాల ఏర్పాటు సంతోషకరం



సీసీ కెమెరాల ఏర్పాటు చేయడం సంతోషకరం. గ్రామాల్లో దొంగతనాలు, దోపిడీలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు అరికట్టవచ్చు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలి. ప్రజలు, దాతలు ముందుకు రావాలి.

– ఆత్మలింగారెడ్డి, కలుకుంట్ల, సర్పంచ్

క్రీడలతో మానసికోల్లాసం

ధరూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అన్నారు. మండలంలోని ర్యాలంపాడులో సవారమ్మ జాతర సందర్భంగా కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ హాజరై పోటీలను ప్రారంభించారు. కొంత సమయం కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. సవారమ్మ జాతర ఉత్సవాలలో భాగంగా సవారమ్మ, కర్రెమ్మ ఆలయాల్లో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రంజిత్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు కర్రెమ్మ, పురుషోత్తమ్‌రెడ్డి, అంపన్న, నర్సింహులు, బుచ్చిబాబు, రంగస్వామి, పరుశురాముడు, జమ్మన్న, గోవిందు, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న రంజిత్‌కుమార్

మరోసారి మోదీ సర్కార్‌దే పీఠం



తనగలలో గోడపై పెయింటింట్ వేయిస్తున్న రామచంద్రారెడ్డి

శాంతినగర్: దేశంలో మరోసారి మోదీ సర్కార్ రాబోతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. వడ్డేపల్లి మండలంలోని తనగలలో దేశంలో మరోసారి మోదీ సర్కార్, తెలంగాణలో ఈసారి బీజేపీ ప్రభుత్వం అని గోడలపై బుధవారం ఆయన పెయింటింగ్‌ను వేయించారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తెలంగాణలోనూ బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ఆశాభావం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు నరసింహ, తనగల శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ రంజిత్‌పటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని ప్రహరీ ధ్వంసం

అయిజ: మండలంలోని కొత్తపల్లి గ్రామ పరిధిలోని కొత్తూరులో మంగళవారం రాత్రి బోర్‌వెల్ వాహనం ఢీకొని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం ప్రహరీ ధ్వంసం అయ్యాయి. వాహన డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఈ ఘటన జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు బుధవారం కొత్తపల్లి గ్రామస్తులు ఇన్‌చార్జ్ ఎంఈఓ నరసింహకు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ధ్వంస మైన గోడ స్థానంలో కొత్తగా నిర్మించాలని వినతిపత్రం అందజేశారు.



దెబ్బతిన్న పాఠశాల ప్రహరీ

వాల్‌పోస్టర్ల విడుదల

మదనాపురం: రాష్ట్ర ప్రభుత్వం హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్‌చేశారు. బుధవారం మండల కేంద్రంలో హమాలీ కార్మికులతో కలిసి ఈనెల 29న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, 55 ఏళ్ల వయసు పైబడిన హమాలీలకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం అధ్యక్షుడు గోపాల్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి నరేందర్, ఆంజనేయులు, వెంకటస్వామి, వెంకటన్న, సవరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆపరేటర్‌కు తీవ్రగాయాలు



మల్దకల్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న రాములు విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాలైన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బిజ్వారం సబ్ స్టేషన్‌లో ఆపరేటర్‌గా రాములు విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి కురిసిన వర్షంతో సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో సబ్ స్టేషన్‌లో ఆపరేటర్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన రాములను గమనించిన సిబ్బంది చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ రాజారెడ్డి బుధవారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ట్రాక్టర్‌ను ఢీ కొన్న డీసీఎం

మానవపాడు: జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను డీసీఎం ఢీ కొన్న ఘటన మండలంలోని జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం కర్నూల్ నుంచి జోగులాంబ గద్వాలకు కట్టెల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ మానవపాడు స్టేజీ దాటిన తర్వాత డీజిల్ అయిపోయి నిలిచింది. అదేసమయంలో కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీక్నొది. ఈ ఘటనలో డీసీఎం డ్రైవర్ షానుకు స్వల్ప గాయాలయ్యాయి.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

మల్దకల్: బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలైన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యుల వివరాల ప్రకారం నేతువాని పల్లె గ్రామానికి చెందిన దర్శెల్లి గద్వాల నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహంపై బయలుదేరాడు. బూడిదపాడు దగ్గరకు రాగానే బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దంచికొట్టిన వాన



రాజోళి మండలం పెద్ద తాండ్రపాడులో తడిసిన మొక్కజొన్న కంకులను చూస్తున్న రైతు

- తడిసిన మొక్కజొన్న, వరి, మిర్చి
- ఆందోళనలో రైతులు

శాంతినగర్: మండలంలో మంగళవారం అర్ధరాత్రి వర్షం కురిసింది. అకాల వర్షానికి రైతులు కుదేలు అయ్యారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. కొన్ని చోట్లు వర్షంనీటిలో కొట్టుకుపోయాయి. మండలంలోని రామాపురం, జిల్లెడుదిన్నె, కొంకల, జూలెకల్, వెంకట్రామనగర్, తనగల గ్రామాల్లో వందల క్వింటాళ్ల ధాన్యం కల్లాల్లో ఆరబెట్టారు. అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో ధాన్యం మొత్తం తడిచి ముద్దయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రాజోళి: మండల కేంద్రంతో పాటు రాజోళి, పచ్చర్ల, ముండ్లదిన్నె, పెద్ద తాండ్రపాడు తదితర గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న ధాన్యం తడిసింది.

మానవపాడు: మండలంలో మంగళవారం కురుసిన వర్షం 42.0 మిల్లీమీటర్ల వర్షపాతంగా నమోదైంది. వివిధ గ్రామాల్లో కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి తడిసింది. రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

ఉండవెల్లి: మండల కేంద్రంతో పాటు తక్కశిల, కంచుపాడు గ్రామాల్లో వాన దంచికొట్టింది. మొక్కజొన్న ధాన్యం తడిసింది. టార్పాలిన్లతో కప్పి కొందరు ధాన్యాన్ని కాపాడుకున్నారు. మారమునగాల, ఇటిక్యాలపాడు, బొంకూరు గ్రామాల్లో మిర్చి రైతులు నష్టపోయారు.

గట్టు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతొ కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం 38.6 మిల్లీమీటర్లుగా నమోదైంది. ఈ వర్షం కారణంగా వ్యవసాయ పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం రాసులు తడిసి పోవడంతో రైతులు లబోదిబోమన్నారు. కొన్నిచోట్ల వరపైరు నేలకు ఒరిగింది. మిర్చి రైతులు ఇబ్బంది పడ్డారు. మామిడికాయలు నేలపై రాలాయి.



శాంతినగర్ జిల్లెడుదిన్నెలో తడిచిన మొక్కజొన్న ధాన్యం



మానవపాడులతో టార్పాలిన్ల నుంచి నీటిని తొలగిస్తున్న రైతులు



ఉండవెల్లి మండలం బైరాపురంలో..

వైభవంగా రాములోరి కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: శ్రీరాముని జన్మనక్షత్రం పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని కోదండరామస్వామి ఆలయంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుకను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నర్సింహ ఆచారి ఆధ్వర్యంలో సీతారాముల విగ్రహాలను ముస్తాబుచేసి వేదమంత్రాల నడుమ అర్చకులు రాములోరికి వైభవంగా కల్యాణ తంతు జరిపించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలను ఆచరించారు. ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు ఆధ్వర్యంలో కల్యాణం కోసం ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చట్టాలపై అవగాహన

గద్వాల రూరల్: ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని గద్వాల రూరల్ ఎస్‌ఐ ఆనంద్ అన్నారు. బుధవారం మండలంలోని పూడూరులో షీటీం, భరోసా టీం, పోలీసు కళాజాతా బృందా ద్వారా రోడ్డు నిబంధనలు, సైబర్‌నేరాలు, బాల్యవివాహాలు, మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు వేధింపులకు గురైతే షీటీం నంబర్లు 8712670312, 7993133139కు తెలపాలన్నారు. పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీటీం సభ్యులు రాధమ్మ, కృష్ణ, రామాంజనేయులు, రాంరెడ్డి, శేషన్న తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ఆనంద్

లెక్చరర్‌కు సన్మానం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్న దేవుజా ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా విడుదలైన టీఎస్-సెట్ (తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష) ఫలితాల్లో భౌతికశాస్త్రం విభాగంలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, అధ్యాపక బృందం బుధవారం కళాశాలలో దేవుజాకు పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు ఉన్నారు.



దేవుజాను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

పారిశుద్ధ్యంపై అధికారుల నిర్లక్ష్యం తగదు



మురుగును పరిశీలిస్తున్న కలీముల్లా

శాంతినగర్: మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో ఇటీవల కురిసిన వర్షాలతో మురుగు రోడ్లపై ప్రవహిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు కలీముల్లా ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 1, 4, 7, 9 వార్డులలో ఆయన పర్యటించారు. వార్డులలో నెలకొన్న సమస్యలను ఆయా కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలీముల్లా మాట్లాడుతూ అన్ని వార్డులలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందన్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం తగదన్నారు. ఎటువంటి పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతోనే రోడ్లపై మురుగు ప్రవహిస్తోందన్నారు. కౌన్సిలర్లకు, ప్రజాప్రతినిధులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంఘం కమిటీ ఏర్పాటు

అయిజ: పట్టణంలోని రాయల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో బుధవారం నాయీ బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు భగీరథ వంశీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు హాజరై నియోజకవర్గం స్థాయి మంగళ వాయిద్య కళాకారుల, నాయీ బ్రాహ్మణ సేవా సంఘం కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా ఉప్పల గోవిందు, ప్రధాన కార్యదర్శిగా బ్యాండ్ ఆంజనేయులు, కళాకారుల సంఘం అధ్యక్షుడిగా నరసింహ, ప్రధాన కార్యదర్శిగా అజయ్ ఎంపికయ్యారు. ఎంపికై న అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ప్రమాణ స్వీకారం చేశారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నాయకులు

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి



యల్లందొడ్డిలో కంటి వెలుగును ప్రారంభిస్తున్న సర్పంచ్

గట్టు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ రాధిక, గట్టు-2 ఎంపీటీసీ కృష్ణలు అన్నారు. బుధవారం యల్లందొడ్డి కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ రాధిక, వైద్యాధికారి సౌజన్య ప్రారంభించారు. ఆరగిద్ద, ఇందువాసి గ్రామాల్లో కూడా కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. మూడు గ్రామాల్లో మొత్తం 441 మందికి కంటి పరీక్షలను నిర్వహించగా, 20 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా, 36 మందికి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, నర్సింహులు, సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్‌ఎంలు ఈశ్వరమ్మ, రేష్మ, నర్మద, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కూలి డబ్బులు చెల్లించాలంటూ ధర్నా

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని మూలమళ్లలో ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు పెండింగ్ ఉన్న కూలి డబ్బులు చెల్లించాలంటూ బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కూలి డబ్బులు చెల్లించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు మూడు నెలల కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనిపై కూలీలు అధికారులకు విన్నవించినా ఫలితం లేదని వాపోయారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధిహామీ పథకానికి నిధులు మంజూరు చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600 చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి రెండు వందల రోజుల పనిదినాలు కల్పించి కూలీలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఏపీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు రంగమ్మ, లక్ష్మమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు డీకే అరుణ పర్యటన

శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ గురువారం పర్యటించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అకాల వర్షాల కారణంగా కల్లాల్లో తడిచిన మొక్కజొన్న ధాన్యాన్ని పరిశీలిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.